
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 25 । మే । 2025



జీఎం ఆఫీస్ ముట్టడి..
జేకేఓసీ నిర్వాసితులకు పరిహారం, పున రావాసం కల్పించాలంటూ సింగరేణి జీఎం కార్యాలయాన్ని ముట్టడించారు. 8లో



'థైరాయిడ్'పై నిర్లక్ష్యం వద్దు..
థైరాయిడ్ వ్యాధిపై నిర్లక్ష్యం చేస్తే మరిన్ని అనారోగ్య సమస్యలకు కారణమవుతుందని నిపుణులు అంటున్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 33° / 26°
జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత కొన్ని చోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రతి మనిషికీ ఓ లక్ష్యం ఉండాలి

పాల్వంచ: ప్రతీ మనిషి ఏదో ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు దేవనాథ జీయర్ స్వామి అన్నారు. పట్టణంలోని ఆత్మలింగేశ్వరాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఇటీవల ఆలయ పునఃప్రతిష్ఠ చేయగా.. దేవస్థానం విశిష్టతను వివరించారు. ఆలయాల ఎదుట ఉండే ధ్వజస్తంభాల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. తొలుత స్వామీజీకి ఆలయ ప్రధానార్చకులు జితేందర్ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

32 మంది మైనింగ్ అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ ఏరియాల్లో పని చేస్తున్న 32 మంది అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు జూన్ 6వ తేదీ లోపు కేటాయించిన ఏరియాల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాయకల్ప బృందం పరిశీలన

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని కాయకల్ప బృందం సభ్యులు శనివారం పరిశీలించారు. గతంలో పరిశీలన చేసినప్పుడు ఇంటర్నల్ క్వాలిఫై కాగా, ప్రస్తుతం ఎక్స్‌టర్నల్ బృందం సందర్శించింది. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను సభ్యులు డాక్టర్ నిరంజన్, శ్రీకాంత్ స్వామి, రాధిక శర్మ తనిఖీ చేశారు. స్వచ్ఛత, సదుపాయాలు, పారిశుద్ధ్య రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు తదితర వివరాలు ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ రాంనివాస్, డాక్టర్లు మాధురి, సుధతో పాటు నాగేంద్రమ్మ, ఫర్జానా, భారతి పాల్గొన్నారు.

కాపీ చేస్తే కొరడానే!

రామయ్య మూలమూర్తుల చిత్రాలకు పేటెంట్
- అక్రమార్కుల అడ్డగోలు పూజలకు ఇక చెక్
- రాష్ట్రంలోనే తొలి ఆలయంగా భద్రగిరి



రామయ్య మూలమూర్తులు



స్వామి వారి ఉత్సవ మూర్తులు

భద్రాచలం : భద్రాద్రి రామయ్య మూలమూర్తుల చిత్రాలకు, బొమ్మలకు పేటెంట్ హక్కులు దక్కాయి. రామయ్య పేరుతో, మూలమూర్తులు, ఉత్సవ మూర్తుల ఫొటోలతో అక్రమంగా పూజలు చేసే ఆధ్యాత్మిక వ్యాపారానికి చెక్ పడింది. రామయ్య మూలమూర్తుల చిత్రాలను కాపీ చేస్తే దేవస్థానం అధికారులు ఇక కొరడా ఝుళిపించనున్నారు. పేటెంట్ రైట్స్ కలిగిన దేవుడిగా రాష్ట్రంలోనే తొలిసారిగా భద్రగిరి రామయ్య నిలిచాడు.

భద్రగిరిలోనే ప్రత్యేకం..
ప్రపంచవ్యాప్తంగా ఉన్న రామాలయాల్లో కెల్లా భద్రగిరి రామయ్య మూలమూర్తులు చాలా ప్రత్యేకం. అన్ని దేవస్థానాల్లో రాముడు, పక్కన సీతమ్మ, లక్ష్మణుడు, పాదాల చెంత ఆంజనేయ స్వామి దర్శనమిస్తుంటారు. కానీ భద్రాచలానికి గల ప్రాశస్త్యం, ప్రాంత విశిష్టత విలక్షణమైనది. భద్ర మహర్షి కఠోర తపస్సు, రామ తారక మంత్రోచ్చారణతో మెచ్చిన శ్రీ మహా విష్ణువు శ్రీరామ రూపాన్ని దాల్చి చతుర్భుజ రామునిగా శంకు, చక్ర, ధనుర్బాణాలను ధరించి, వామాంకమున(ఎడమ తొడపై)సీత, వామ పార్శ్వమున(ఎడమ పక్కన) లక్ష్మణుడితో కూడి పద్మాసనమున ఆశీనుడై దర్శనమిస్తారు. పాదాల చెంత ఆంజనేయస్వామి లేని మూలమూర్తులు భద్రాచలంలోనే భక్తులకు కనిపిస్తారు. దీంతో పాటు రామాయణ వనవాస ఇతివృత్తాలతో పరిసర ప్రాంతాలకు అనుబంధం ఉండడంతో దేశ, విదేశాల భక్తులు రామయ్యను విశేషంగా, ఇలవేల్పుగా కొలుస్తారు.

పేటెంట్ హక్కులకు బీజం ఇలా..
రామాలయంలోని బేడా మండపంలో జరిగే నిత్యకల్యాణం, శ్రీరామనవమి ఉత్సవాలకు రామయ్య మూలమూర్తులతో పోలిన ఉత్సవ విగ్రహాలను వినియోగిస్తారు. అయితే గత దశాబ్ద కాలంగా కొన్ని సంస్థలు తెలంగాణ, ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో స్వామివారి మూలమూర్తులను పోలిన విగ్రహాలకు నిత్యకల్యాణం, ప్రత్యేక పూజలు చేస్తూ ధనార్జన చేపట్టాయి. ఇటీవల 'ఖగోళ యాత్ర' పేరుతో వెబ్‌సైట్‌లో సైతం భద్రాచలం శ్రీరామ పేరుతో ప్రపంచవ్యాప్తంగా నిత్యకల్యాణం చేసేందుకు విరాళాలు సేకరించారు. దీనికి వెబ్‌సైట్‌ను సైతం క్రియేట్ చేసి దాతలను ఆహ్వానించారు. భద్రాచలం రాముడి పేరు, మూలమూర్తులను పోలిన చిత్రాలు ఉండడంతో భక్తులు ఆలయానికి సంబంధించిన ఆధ్యాత్మిక కార్యక్రమంగా భావించి విరాళాలు అందజేశారు. ఈ క్రమంలో అదే ధార్మిక సంస్థ భద్రాచలంలో సైతం ఈ పూజలు చేయాలని భావించింది. ఈ విషయం ఆలయ ఈఓ రమాదేవి దృష్టికి రావడంతో వెంటనే భద్రాచలం శ్రీరామ, మూలమూర్తులను తొలగించాలంటూ పోరాడారు. చివరకు ఆ సంస్థ వాటిని తొలగించాకే పూజలు జరిగాయి. అయితే భవిష్యత్‌లో సైతం రామయ్య మూలమూర్తుల చిత్రాల ద్వారా ఎలాంటి అక్రమాలు జరగకుండా పేటెంట్ హక్కుల కోసం ఈఓ దరఖాస్తు చేయగా, తాజాగా లభించాయి.

ఉల్లంఘిస్తే చర్య తప్పదు..
పేటెంట్ హక్కులు రావడంతో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలోని మూలమూర్తుల చిత్రాలు, బొమ్మలను వాణిజ్యపరంగా బయట వినియోగించడం నేరం. ఆధ్యాత్మికంగా, ఉచితంగా ఈ చిత్రాలను వినియోగించుకోవాలంటే దేవస్థానం అనుమతి తప్పనిసరి. ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలతో పాటు భారీగా జరిమానా విధించే అవకాశం ఉందని న్యాయవాదులు చెబుతున్నారు. ఈ ఏడాది జూన్ 20నుంచి పేటెంట్ హక్కులు అమల్లోకి వస్తాయని తెలిపారు. కాగా, భవిష్యత్‌లో రామయ్య ప్రసాదమైన లడ్డూ, చక్కెర పొంగలి, ఇప్పలడ్డూల పై సైతం హక్కులు పొందేలా అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం.

రామయ్య చిత్రాలు దుర్వినియోగం కావొద్దనే



ఎంతో విశిష్టత కలిగిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి మూలమూర్తులు దుర్వినియోగం కావొద్దనే పేటెంట్ హక్కులు పొందాం. గతంలో దేశ, విదేశాల్లో స్వామి వారి మూలమూర్తుల చిత్రాలను వినియోగించుకుని అక్రమార్జనకు పాల్పడ్డారు. దీన్ని అడ్డుకోవడంతో పాటు భవిష్యత్‌లో ఆలయానికి అప్రతిష్ఠ రాకుండా చర్యలు చేపట్టాం. అవకాశం ఉంటే ప్రసాదాలపైనా పేటెంట్ హక్కులు తెచ్చేలా ప్రయత్నిస్తాం. – ఎల్.రమాదేవి, ఈఓ

'బయోచార్'పై కలెక్టర్ నజర్

తొలి ప్రదర్శన నిర్వహించిన జితేష్ వి పాటిల్



బయోచార్ తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా బయోచార్ తయారీకి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ క్రమంలో తన క్యాంప్ కార్యాలయం పక్కన శనివారం తొలి ప్రదర్శన నిర్వహించారు. ఖాళీ డ్రమ్ కింది భాగంలో గాలి ప్రవేశించేలా రంధ్రాలు చేశారు. ఈ డ్రమ్‌ను మూడు సిమెంట్ రింగుల మధ్య ఉంచి అడుగులో ఎండిన ఆకులు వేసి మంట పెట్టారు. పై భాగంలో ఎండిపోయిన, పనికిరాని మొక్కల భాగాలను వేసి డ్రమ్‌కు మూత పెట్టారు. రింగుల మధ్యలోను ఆకులు, పొట్టు వేసి మంటపెట్టడంతో లోపల ఏర్పడే పొగ తక్కువగా ఉంటుంది. తక్కువ ఆక్సిజన్‌లో కాలిన మొక్కలు బూడిదగా మారకముందే వాటిని చల్లార్చితే ఏర్పడిన బొగ్గును బయోచార్ అంటారని కలెక్టర్ వెల్లడించారు. దీన్ని పొడిలా చేసి పొలాల్లో వాడితే పంటల దిగుబడి పెరుగుతుందని, దీనికి పశుమూత్రం జోడించి ఉపయోగిస్తే మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. మట్టిలో జీవపదార్థం పెంపు, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుదల, ఎరువుల అవసరం తగ్గింపు, వాతావరణ మార్పుల ప్రతికూలతను తగ్గించే శాశ్వత కార్బన్ నిల్వ, నేల స్థిరంగా ఉండేలా చేయడం వంటి ఉపయోగాలు ఉంటాయని వివరించారు. ఇది ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే ఉత్తమ మార్గంగా నిలుస్తుందని అన్నారు.

అర్బన్ పార్క్‌లో సౌకర్యాలు మెరుగుపరుస్తాం

డీఎఫ్‌ఓ సిద్ధార్థసింగ్



పూబెల్లిలో అటవీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సిద్ధార్థసింగ్

ఇల్లెందురూరల్: అర్బన్ పార్క్‌లో సౌకర్యాలు మెరుగుపర్చేలా చర్యలు తీసుకుంటామని ఇంచార్జ్ డీఎఫ్‌ఓ సిద్ధార్థసింగ్ అన్నారు. మండలంలోని పూబెల్లి అటవీ ప్రాంతాన్ని, అర్బన్ పార్క్‌ను శనివారం ఆయన పరిశీలించారు. పూబెల్లిలో జలవనరులను సద్వినియోగం చేసుకుంటూ మొక్కలను విస్తారంగా పెంచాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున చావు మొక్కలను గుర్తించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని చెప్పారు. అర్బన్ పార్క్‌లో వాచ్‌టవర్, చిల్డ్రన్ జిమ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పార్క్‌లో సందర్శకుల సంఖ్య పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, దీనికోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, ఎఫ్ఆర్ఓ ప్రసాద్ పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయాలి

విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు విజయలక్ష్మీబాయి



మాట్లాడుతున్న విజయలక్ష్మీబాయి, పక్కన డీఈఓ

కొత్తగూడెంఅర్బన్/పాల్వంచ : ప్రధానోపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తే ప్రభుత్వ విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించవచ్చని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు విజయలక్ష్మీబాయి అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో జరుగుతున్న హెచ్ఎంల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడం, నాణ్యమైన బోధన, విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడం వంటివి ఉపాధ్యాయులకే సాధ్యమని అన్నారు. కొందరు పిల్లల్లో ఇటీవల వింత ధోరణులు కనిపిస్తున్నాయని, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయుల చొరవతోనే వాటిని అరికట్టొచ్చని అన్నారు. అనంతరం పాల్వంచ కొమ్ముగూడెం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఇక్కడ నేర్చుకున్న అంశాల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు ఆయా సబ్జెక్టులపై అవగాహన కల్పించాలని అన్నారు. డీఈఓ ఎం.వెంకటేశ్వరా చారి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని, నిరంతరం సబ్జెక్ట్‌లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సైదులు, డీఆర్పీలు ఆనందకుమార్, మీరా సాహెబ్, విజయబాబు, బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

697 కిలోల గంజాయి స్వాధీనం

విలువ రూ.3.48 కోట్లు.. హరియాణా వాసుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్

టేకులపల్లి: టేకులపల్లి మీదుగా భారీ మొత్తంలో తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం పోలీసుస్టేషన్‌లో సీఐ తాటిపాముల సురేష్ వివరాలను వెల్లడించారు. హరియాణాకు చెందిన సందీప్‌కుమార్, లక్విందర్, అమర్‌నాథ్ కుమార్, పవన్‌కుమార్, కృషన్, కుమార్ కొన్నేళ్లుగా గంజాయి రవాణా చేస్తున్నారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా బచ్చలూరులో హరికరన్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కురుక్షేత్ర జిల్లాకు తరలించి ప్రిన్స్ కుమార్‌కు విక్రయించేవారు. ఈ క్రమంలో శనివారం బచ్చలూరు నుంచి గంజాయి తీసుకుని కురుక్షేత్రకు రవాణా చేసేందుకు ఐచర్ వ్యాన్‌లో తరలిస్తున్నారు. ముందు ఎస్కార్ట్‌గా కారులో నిందితులు వెళ్తుండగా పక్కా సమాచారంతో టేకులపల్లి, సీసీఎస్ పోలీసులు ముత్యాలంపాడు క్రాస్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో కారు, వెనకాలే వచ్చిన వ్యాన్‌ను తనిఖీ చేయగా రూ.3.48కోట్ల విలువైన 697.160 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో నిందితులను అదుపులోకి తీసుకుని, గంజాయి అమ్మిన హరికరన్, తెప్పించిన ప్రిన్స్‌కుమార్‌పైనా కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. గంజాయి రవాణాను అడ్డుకున్న సీఐలు టి.సురేష్, రమాకాంత్, ఎస్ఐలు రాజేందర్, ప్రవీణ్, రామారావును ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.

చలచల్లగా వెళ్లొద్దామా!

మండు వేసవిలో ఏసీ బస్సులకు ఆదరణ
- ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ బస్సులు
- ఇతర డిపోల నుంచి సైతం రాజధాని, లహరి సర్వీసులు
- రెండు నెలల్లో రీజియన్‌కు రూ.7.43 కోట్ల ఆదాయం





కొత్తగూడెం బస్టాండ్‌లో రాజధాని ఏసీ బస్సు (ఇన్‌సెట్) ఖమ్మం - హైదరాబాద్ లహరి బస్సులో పూర్తిగా బుక్ అయిన సీట్లు

ఖమ్మంమయూరిసెంటర్/మంచుపల్లి: మండు వేసవిలోనూ చల్లని గాలిలో పయనం సాగించేలా ప్రయాణికులు ఏసీ బస్సులను ఎంచుకుంటున్నారు. వారి అవసరం, ఆసక్తికి అనుగుణంగా టీజీఎస్ ఆర్టీసీ ఏసీ బస్సుల సంఖ్య పెంచింది. తద్వారా ఏప్రిల్, మే నెలల్లో ఈ బస్సులు నడిపించడం ద్వారా 1,62,557 మంది గమ్యస్థానాలకు చేరడంతో ఖమ్మం రీజియన్‌కు రూ.7,43,53,892 ఆదాయం సమకూరింది. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు గంటకొకటి చొప్పున నాన్ స్టాప్ రాజధాని సర్వీసులు నడిపించడం, ఖమ్మంతో పాటు మిగతా డిపోల నుంచి రాజధాని, లహరి ఏసీ బస్సుల ద్వారా ప్రయాణికులకు సేవలందాయి.

చార్జీ ఎక్కువైనా ఓకే..
ఉమ్మడి జిల్లాలో ఈ వేసవిలో ఎండలు 42 డిగ్రీలకు మించి నమోదవుతున్నాయి. ఈ నేపథ్యాన బస్టాండ్లకు వస్తున్న వారు ఏసీ బస్సు కనిపిస్తే చాలు ఎక్కేస్తున్నారు. దూర ప్రయాణాలకైతే తప్పనిసరిగా ఏసీ బస్సుల్లోనే సీట్లు ముందస్తుగా రిజర్వ్ చేసుకుంటున్నారు. ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులతో పోలిస్తే ఏసీ బస్సుల్లో చార్జీలు అధికంగా ఉన్నా ఎండ నేపథ్యాన లెక్క చేయడం లేదు. దీంతో దాదాపు అన్ని రోజుల్లోనూ ఏసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 100శాతం నమోదవుతోంది. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు సైతం ఆదివారం, ఇతర ప్రత్యేక రోజుల్లో సర్వీసుల సంఖ్య పెంచుతున్నారు. అయితే, రీజియన్‌లోని ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, సత్తుపల్లి డిపోలకు రాజధాని, లహరి ఏసీ బస్సులు ఉండగా ఎక్కువగా హైదరాబాద్ రూట్‌లోనే తిప్పుతున్నారు. ఇవికాక హైదరాబాద్‌లోని డిపోల నుంచి సైతం ఉమ్మడి జిల్లాకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ఏసీ బస్సులు నడిపిస్తున్నారు. కాగా, కరీంనగర్, గోదావరిఖని, నిజామాబాద్, మంచిర్యాల తదితర ప్రాంతాలకు సైతం ఒకటి, రెండు ఏసీ బస్సులు ఏర్పాటుచేయాలనే ప్రయాణికుల డిమాండ్‌ను అధికారులు పరిశీలిస్తున్నారు.

రూ.7.43 కోట్ల ఆదాయం..
ఈ వేసవిలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఏసీ బస్సులను రెగ్యులర్‌తో పోలిస్తే ఎక్కువ సర్వీసులు నడిపించింది. ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం డిపోల నుంచి ఏప్రిల్ నెలతో పాటు ఈనెల 23 వరకు 1,62,557 మంది ప్రయాణించగా రికార్డు స్థాయిలో రూ.7,43,53,892 ఆదాయం సమకూరింది. ఇందులో 34 రాజధాని బస్సుల్లో 1,49,816 మంది నుంచి రూ.6,52,25,993, నాలుగు లహరి ఏసీ బస్సుల్లో 12,741 మంది ప్రయాణించగా రూ.91,27,899 ఆదాయం నమోదైంది. రెండూ కలిపి ఏప్రిల్ నెలలో 87,322 మంది ప్రయాణించగా రూ.3,96,46,952, ఈనెల 23 వరకు 75,235 మంది ప్రయాణించగా రూ.3,47,06,940 ఆదాయం సమకూరిందని గణాంకాలు చెబుతున్నాయి.

ఖమ్మం డిపో నుంచే..
ఖమ్మం రీజియన్‌కు వచ్చిన ఆదాయంలో ఖమ్మం డిపో నుంచే అత్యధికంగా లభించింది. ఈ రెండు నెలల కాలంలో రాజధాని బస్సులు 34, లహరి ఏసీ బస్సులు నాలుగు తిరగగా.. ఖమ్మం డిపో నుంచి 21 రాజధాని, రెండు లహరి బస్సులు తిప్పారు. రాజధాని బస్సుల్లో 96,040 మంది ప్రయాణించగా.. రూ.4,16,52,551, లహరి ఏసీ బస్సుల్లో 4,873 మంది ప్రయాణించగా రూ.45,26,719 ఆదాయం సమకూరింది. రీజియన్ మొత్తం ఆదాయంలో 62 శాతం ఖమ్మం డిపో నుంచే లభించడం విశేషం. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు గంటకొకటి చొప్పున రాజధాని ఏసీ నాన్ స్టాప్ బస్ నడపడం కలిసొచ్చింది.

ఏసీ బస్సులకు డిమాండ్



ఎండల దృష్ట్యా దూరప్రాంతాలకు సాధారణ బస్సుల్లో ప్రయాణించడం కష్టమే. అందుకే చాలామంది ఏసీ బస్సులు ఎంచుకుంటున్నారు. చల్లని వాతావరణంలో వెళ్లొచ్చేలా ఏసీ బస్సులు అనువుగా ఉంటాయి. అందుకే ఈ బస్సులకు డిమాండ్ పెరిగింది.
– పి.కిరణ్‌కుమార్, డ్రైవర్

ఆదరణ పెరిగింది..



వేసవిలో ప్రయాణికులు ఏసీ బస్సుల వైపే మొగ్గు చూపుతున్నారు. జిల్లా పరిధిలో పది సర్వీసులు ఉండగా, హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు తిప్పుతున్నాం. ప్రతిరోజు 2వేల మందికి పైగానే ప్రయాణికులు వీటి ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు.
– దేవేందర్ గౌడ్, డీఎం, కొత్తగూడెం

ఏప్రిల్, మే 23వరకు ఏసీ బస్సులతో వచ్చిన ఆదాయం

డిపో	ప్రయాణికులు	ఆదాయం (రూ.ల్లో)
ఖమ్మం	1,00,913	4,61,79,270
భద్రాచలం	37,563	1,71,23,886
సత్తుపల్లి	21,237	98,56,103
కొత్తగూడెం	2,844	11,94,633
మొత్తం	1,62,557	7,43,53,892

క్లుప్తంగా

అశోక్‌నగర్‌లో నివాసాల కూల్చివేత



జేసీబీ ద్వారా ఇళ్లను కూల్చివేస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీలో ఉన్న 41 నివాసాలను శనివారం గ్రామ పంచాయతీ అధికారులు కూల్చివేశారు. కాగా, ఈ ఇళ్లలో ఉండే వారికి రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించిందని, ఈ ప్రాంతంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జామాయిల్ మొక్కలను నాటి, సంరక్షించనున్నామని గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాస్ వెల్లడించారు.

ఓయూ నుంచి డాక్టరేట్



అశోక్‌కుమార్

సత్తుపల్లి: సత్తుపల్లిలోని గీతమ్స్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి, అశ్వారావుపేట మండలం ఆసుపాకకు చెందిన కునుసోతు అశోక్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి.రమాదేవి పర్యవేక్షణ లో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఓయూ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. వేరుశనగలో వచ్చే కాండం కుళ్లు తెగులును తక్కువ ఖర్చుతో, సైడ్ ఎఫెక్టులు లేకుండా నిరోధించేలా చేసిన పరిశోధనలపై అశోక్‌కుమార్ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను గీతమ్స్ కళాశాల డైరెక్టర్ దొడ్డా శ్రీనివాసరెడ్డి, శాంతినికేతన్ కళాశాల ప్రిన్సిపాల్ మమంద్రారెడ్డి తదితరులు అభినందించారు.

ట్రాక్టర్ ఢీకొని కార్మికులకు గాయాలు



చికిత్స పొందుతున్న కార్మికురాలు

పాల్వంచ: ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరు మున్సిపల్ కార్మికులకు గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని దమ్మపేట సెంటర్ వద్ద శనివారం పారిశుద్ధ్య పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులు బొమ్మన కిరణ్, ఇందులను ట్రాక్టర్ ఢీ కొనడంతో స్వల్పగాయాలయ్యాయి. వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన పీఈటీల శిక్షణ



పీఈటీలతో డీఆర్పీలు, కోర్సు ఇన్‌చార్జ్

టేకులపల్లి: జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులకు గత ఐదు రోజులుగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. 100 మంది పీఈటీలు శిక్షణకు హాజరయ్యారు. కోర్సు ఇన్‌చార్జ్‌గా మెరుగు శ్రీనివాస్ వ్యవహరించగా రిసోర్స్ పర్సన్లు నరేష్‌కుమార్, శ్రీనివాసరావు, రామనాథం, కవిత వ్యాయామ విద్యకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. ఇంకా మోటివేషన్, ఫిజియోథెరపీ, సీపీఆర్, నైతిక విలువలు, నేరాలు – వాటి నివారణ తదితర అంశాలపై హైదరాబాద్, కొత్తగూడెం, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన బి.మాధురి, జవ్వాది వెంకటేశ్వరబాబు, షీ టీమ్ ఎస్‌ఐ రమాదేవి, శ్రీజ బోధించారు.

కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని ఆదిత్య ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణంలో జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇల్లెందు ఎస్‌ఐ పి.శ్రీనివాసరెడ్డి కథనం ప్రకారం.. గత ఆదివారం అర్ధరాత్రి దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి సుమారు రూ.1.90 కోట్ల విలువైన సరుకు కాలిపోయిందని యజమాని ప్రొద్దుటూరి నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు అందించారు. కాగా, ఏఓ సతీశ్ అందజేసిన నివేదిక ఆధారంగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

అశ్వారావుపేటరూరల్: విద్యుదాఘాతంతో ఓ పాడి గేదె మృతి చెందిన ఘటన శనివారం అశ్వారావుపేటలో చోటుచేసుకుంది. పట్టణంలోని మెరుపుకాలనీకి చెందిన కోరుకొండ రాజమ్మ తన మూడు పాడి గేదెలను మేత కోసం తీసుకెళ్తున్న క్రమంలో ఓ హోటల్ పక్కనే ఉన్న కరెంట్ స్తంభం (ఐరన్) వద్దకు వెళ్లగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.90 వేలు అని రాజమ్మ వాపోయింది.



పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,058

‘థైరాయిడ్’పై నిర్లక్ష్యం చేయొద్దు..

- అవగాహనతోనే ఆరోగ్యం
- పరీక్షలు తప్పనిసరి

నేడు వరల్డ్ థైరాయిడ్ డే

కరకగూడెం: థైరాయిడ్ మానవ శరీరంలోని మెడ ముందు భాగంలో సీతాకోకచిలుక ఆకారంలో ఉండే ఒక చిన్న గ్రంథి. ఇది థైరాయిడ్ హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. ఈ హార్మోన్లు శరీర జీవక్రియ (మెటబాలిజం) నియంత్రణలో కీలకపాత్ర పోషిస్తాయి. అంటే శరీరం శక్తిని ఎలా ఉపయోగిస్తుంది, ఉష్ణోగ్రతను ఎలా నియంత్రిస్తుంది, గుండె, మెదడు, కండరాల వంటి ముఖ్యమైన అవయవాలు ఎలా పనిచేస్తాయి అనే వాటిని ఈ హార్మోన్లు ప్రభావితం చేస్తాయి. థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పని చేయకుంటే అనేక రకాల ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. థైరాయిడ్ సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ముందస్తు నిర్ధారణ, చికిత్స ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఏటా మే 25న ‘వరల్డ్ థైరాయిడ్ డే’ను జరుపుకుంటారు. జిల్లాలోని ప్రతీ పీహెచ్‌సీలో థైరాయిడ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే దీనిపై అవగాహన లేక చికిత్సలో జాప్యంతో ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి.

రకాలు.. లక్షణాలు..

థైరాయిడ్‌లో హైపోథైరాయిడిజం (థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తి తక్కువగా ఉండటం), హైపర్ థైరాయిడిజం (హార్మోన్లు అధికంగా ఉత్పత్తి కావడం) ప్రధానమైనవి. ఇంకా థైరాయిడ్ నోడ్యూల్స్, గాయిటర్ (థైరాయిడ్ గ్రంథి వాపు), థైరాయిడ్ కేన్సర్ ఉన్నాయి. అలసట, బరువు పెరగడం, చలి అనుభూతి, జుట్టు రాలడం, నీరసం, డిప్రెషన్, మలబద్ధకం వంటివి హైపోథైరాయిడిజం లక్షణాలు. బరువు తగ్గడం, ఆందోళన, వేగంగా గుండె చప్పుడు, చెమటలు, వణుకు, నిద్రలేమి హైపర్ థైరాయిడిజం లక్షణాలు. గాయిటర్ లేదా నోడ్యూల్స్ ఉన్నవారిలో మెడ వాపు, గొంతులో అసౌకర్యం వంటివి కనిపిస్తాయి.



ముఖ్యంగా మహిళల్లో..

మహిళల్లో థైరాయిడ్ సమస్యలు పురుషుల కంటే 58 రెట్లు ఎక్కువగా కనిపిస్తాయి. ముఖ్యంగా గర్భం, ప్రసవం తర్వాత లేదా రుతుక్రమం ఆగిన తర్వాత (మెనోపాజ్) ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయిలు థైరాయిడ్ గ్రంథి పనితీరును ప్రభావితం చేయవచ్చు. గర్భధారణ సమయంలో హైపోథైరాయిడిజం లేదా హైపర్‌థైరాయిడిజం మాతా, శిశు ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చు.

కారణాలు..

థైరాయిడ్ సమస్యకు అనేక కారణాలు ఉన్నాయి. హైపోథైరాయిడిజం సాధారణంగా ఆటోఇమ్యూన్ రుగ్మతలు, అయోడిన్‌లోపం, థైరాయిడ్ శస్త్రచికిత్స, రేడియేషన్ థెరపీ లేదా కొన్ని రకాల మందులతో వస్తుంది. హైపర్ థైరాయిడిజం గ్రేవ్స్ డిసీజ్, థైరాయిడ్ గ్రంథి వాపుతో వస్తుంది. జన్యు కారణాలు, ఒత్తిడి, హార్మోన్ల అసమతుల్యత, గర్భం లేదా ప్రసవం తర్వాత హార్మోన్ల మార్పులు కూడా థైరాయిడ్ సమస్యలకు కారణం. అయోడిన్ లోపం లేదా అధికంగా తీసుకున్నా దీని బారిన పడతారు.

నివారణ, చికిత్స

థైరాయిడ్ సమస్య వస్తే సమతుల ఆహారం, అయోడిన్ సమృద్ధిగా ఉండే ఆహారాలు (సీఫుడ్, పాల ఉత్పత్తులు, అయోడైజ్డ్ ఉప్పు) తీసుకోవాలి. వైద్య పరీక్షలు, ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా సహాయపడతాయి. చికిత్సలో హైపోథైరాయిడిజం కోసం లెవోథైరాక్సిన్ వంటి హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ, హైపర్‌థైరాయిడిజం కోసం యాంటీథైరాయిడ్ మందులు, రేడియో అయోడిన్ థెరపీ, లేదా శస్త్రచికిత్స ఉన్నాయి. థైరాయిడ్ కేన్సర్ ఉన్నవారికి శస్త్రచికిత్స, కీమోథెరపీ లేదా రేడియేషన్ అవసరం కావొచ్చు. సరైన చికిత్సతో థైరాయిడ్ సమస్యలను నియంత్రించవచ్చు.

నిర్లక్ష్యం చేయొద్దు



జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో థైరాయిడ్ పరీక్షలు, చికిత్స అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం థైరాయిడ్ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలి. థైరాయిడ్ సమస్యలను సకాలంలో గుర్తించి, సరైన చికిత్స తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. థైరాయిడ్ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దు.

–ఎల్.భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ

స్త్రీనిధి రుణాల చెల్లింపులో చేతివాటం

ఐకేపీ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళల ఆందోళన



ఆందోళన చేస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు

బూర్గంపాడు: స్త్రీనిధి రుణాల చెల్లింపులలో ఐకేపీ సిబ్బంది, స్త్రీనిధి అధికారులు చేతివాటంతో తమకు నష్టం కలిగించారని డ్వాక్రా మహిళలు శనివారం బూర్గంపాడు ఐకేపీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. గౌతమిపురం లక్ష్మీ గ్రామసమాఖ్యలోని డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణాల చెల్లింపులలో ఐకేపీ సిబ్బంది తమ వద్ద నగదు తీసుకుని ఖాతాలో జమచేయలేదని మహిళలు ఆరోపించారు. తాము చెల్లించిన నగదును ఐకేపీ సిబ్బంది సొంత అవసరాలకు వాడుకున్నారన్నారు. స్త్రీనిధి రుణాల చెల్లింపులో బ్యాంకు నిర్దేశించిన నగదు కంటే ఎక్కువ మొత్తాన్ని రికవరీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మీ గ్రామ సమాఖ్యకు చెందిన 20 డ్వాక్రా సంఘాల స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో భారీగా అవకతవకలు జరిగాయని ఆక్షేపించారు. అనంతరం డ్వాక్రా సంఘాలు మహిళలు ఐకేపీ ఏపీఎం నాగార్జునను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన స్త్రీనిధి రీజినల్ మేనేజర్‌కు వివరించగా.. సోషల్ ఆడిట్ నిర్వహించి వాస్తవాలను వెలికితీస్తామని ఆర్‌ఎం హామీనిచ్చారు. అప్పటివరకు లక్ష్మీ గ్రామ సమాఖ్యకు సంబంధించిన లావాదేవీలను చూసే బుక్ కీపర్, సీసీలను ఆ బాధ్యతల నుంచి తప్పించినట్లు ఏపీఎం వెల్లడించారు.

లాభాల ఆశ చూపి నగదు చోరీ

భద్రాచలంఅర్బన్: లాభాల ఆశ చూపి, ఓ వ్యక్తి నుంచి రూ.58 వేలు చోరీ చేసిన ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని మెడికల్‌కాలనీకి చెందిన రంజిత్‌కు ఈ నెల 13న 76720 00241 నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ఆన్‌లైన్‌లో క్యాసినో బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పెడితే లాభాలు వస్తాయని చెప్పాడు. దీంతో రంజిత్ తొలుత రూ.300 ఫోన్‌పే చేయగా, కొద్దిసేపటికే సదరు వ్యక్తి రూ.300 పంపించాడు. మరోసారి రంజిత్ రూ.2,300 ఫోన్‌పే చేయగా తిరిగి రూ.2,300 పంపించాడు. డబ్బు వస్తుందని ఆశపడిన రంజిత్ ఆ తర్వాత విడతలవారీగా సదరు వ్యక్తికి రూ.58 వేలు పంపించాడు. అనంతరం అటువైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని తెలుసుకుని 1930 నంబర్‌లో ఫిర్యాదు చేయగా రూ.58,599 హోల్డ్‌లో పెట్టారు. బాధితుడు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్తకు దేహశుద్ధి చేసిన భార్య

అశ్వారావుపేటరూరల్: కట్టుకున్న భార్యను ఇంట్లో నుంచి బయటకు గెంటేసి, మరో మహిళతో ఉంటున్న భర్తను తాళ్లతో కట్టేసి దేహశుద్ధి చేసిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన ఎస్‌కే అబ్దుల్ హఫీజ్‌కు చర్ల మండలానికి చెందిన ఆనీశ్‌ఫాతిమాతో 17 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో రెండేళ్ల నుంచి వీరిద్దరూ విడిగా ఉంటున్నారు. ఈ క్రమంలో బంధువుల ఇంట్లో ఉంటున్న భార్య, పిల్లల వద్దకు వెళ్లిన అబ్దుల్ హఫీజ్.. వారిపై దాడిచేశాడు. అనంతరం ఆయన ఇదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని ఇంట్లోనే ఉంటున్నట్లు తెలుసుకున్న భార్య, పిల్లలు వచ్చి నిలదీశారు. అనంతరం అతడిని తాళ్లతో కట్టేసి దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అబ్దుల్ హఫీజ్‌ను అదుపులోకి తీసుకుని ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ యయాతి రాజును వివరణ కోరగా.. భార్యపై దాడి చేసి ఇంట్లో నుంచి బయటకు పంపిన ఘటనపై పది రోజుల కిందటే భర్తతోపాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

‘సీతారామ’ గ్రామసభ వాయిదా..

- అధికారుల వాహనాల ఎదుట గిరిజనుల బైఠాయింపు
- రామన్నగూడెంలో ఘటన



అధికారుల వాహనాల ఎదుట బైఠాయించిన గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం కింద నిర్మించే కాల్వలకు సంబంధించిన భూసేకరణ కోసం నిర్వహించే గ్రామసభను గిరిజనులు అడ్డుకొని, అధికారుల వాహనాల ఎదుట బైఠాయించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. మండలంలోని కన్నాయిగూడెం, నారాయణపురం, వేదాంతపుర, అనంతారం గ్రామాల్లో భూసేకరణ కోసం గ్రామసభలు నిర్వహించారు. కానీ, రామన్నగూడెం పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించేందుకు వెళ్లిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల బృందం వాహనాలను స్థానిక గిరిజనులు అడ్డుకుని, వాటి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఊట్లపల్లి వద్దగల వెంకమ్మ చెరువు వరద కాల్వ నిర్మాణానికి సంబంధించి 2008లో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు 60 మంది రైతులకు చెందిన 40 ఎకరాల సాగు భూమిని సేకరించారని, 17 ఏళ్లు అయినా పరిహారం ఇవ్వలేదన్నారు. ఇప్పుడు మళ్లీ సీతారామ ప్రాజెక్టు కాల్వ నిర్మాణాలకు భూసేకరణ ఏవిధంగా చేస్తారని, వెంకమ్మ వరద కాల్వ పరిహారాన్ని 2013 చట్ట ప్రకారం ఇస్తేనే సహకరిస్తామనన్నారు. దీంతో రెండు గంటలకుపైగా అధికారులను అక్కడే ఉండాల్సి వచ్చింది. ఎస్‌ఐ యయాతి రాజు సిబ్బందితో అక్కడి చేరుకొని వారికి నచ్చజెప్పేందుకు యత్నించగా వారు ససేమిరా అన్నారు. వచ్చే సోమవారం జిల్లా కలెక్టర్ వద్దకు రైతులను తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని స్థానిక డీటీ రామకృష్ణ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. గ్రామసభను వాయిదా వేసి, అధికారులు అక్కడి నుంచి వెనుతిరిగారు.

సింగరేణి జీఎం ఆఫీస్ ముట్టడి..



జీఎం కృష్ణయ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణి జేకేఓసీ నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి ఏరియా జీఎం కార్యాలయాన్ని శనివారం ముట్టడించారు. పట్టణంలోని 21 ఏరియా సింగరేణి పురాతన క్వార్టర్లలో నివాసం ఉంటున్న కార్మికులు, చుట్టుపక్కలవారు కలిసి కార్యాలయంలోకి ఎవరినీ వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పారు. అనంతరం జీఎం వీసం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సదర్భంగా అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సభలో నాయకుడు కె.సారయ్య మాట్లాడుతూ.. ఓసీ విస్తరణలో వ్యవసాయ భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఏ నబీ, జె.వెంకటేశ్వర్లు, తోడేటి నాగేశ్వరరావు, దాస్యం ప్రమోద్‌కుమార్, క్లింట్ రోచ్, రాంసింగ్, సురేందర్, కవిత, శ్రీనివాస్, మొగిలి, సదయ్య, మహేష్, లాలు, సత్యనారాయణ, కృష్ణ, రాజు, విజయ్, సారంగపాణి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలతో లాభాలెన్నో..

నిర్మాణాలను పరిశీలించిన అధికారులు



అశ్వారావుపేటరూరల్: ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి

అశ్వారావుపేటరూరల్/మణుగూరురూరల్/సుజాతనగర్: ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెరుగుతాయని, నీటి వృథాను అరికట్టేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, ఇళ్లల్లోనూ తప్పనిసరిగా వాటిని నిర్మించుకోవాలని అధికారులు సూచించారు. ఇంకుడుగుంతలతో నీటి కొరత తీరుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 20 వేల ఇంకుడుగుంతలు నిర్మించాలని, ఇంకా 10 వేల ఇంకుడుగుంతలు నిర్మించనున్నామని వెల్లడించారు. శనివారం అశ్వారావుపే మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీతోపాటు ఎంపీడీఓ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రాజీవ్ యువ వికాసం దరఖాస్తులపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అలాగే మణుగూరు మండలంలోని తోగ్గూడెం, కట్టుమల్లారం, ముత్యాలమ్మనగర్ తదితర గ్రామాల్లో డీఆర్‌డీఓ, అదనపు కలెక్టర్ విద్యాచందన పర్యటించి ఇంకుడుగుంతలను పరిశీలించారు. అలాగే, సుజాతనగర్ మండలంలోని వేపలగడ్డ, రాఘవాపురం గ్రామాల్లో నిర్మిస్తున్న ఇంకుడుగుంతలను డీపీఓ చంద్రమౌళి పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీనివాసరావు, నల్లబోతుల రవి, ప్రవీణ్‌కుమార్, రాందాస్‌నాయక్, రామచందర్‌రావు, అక్షిత, ముత్తారావు, మనోహర్, తేళ్లూరి శ్రీనివాసరావు, పల్నాటి వెంకటేశ్వరరావు, చెన్న కేశవరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ అధికారినంటూ బెదిరింపు

రూ.98 వేలు ఫోన్ పే చేసిన తహసీల్దార్



తహసీల్దార్ ముత్తయ్య

టేకులపల్లి: ఏసీబీ అధికారినంటూ ఏకంగా తహసీల్దార్‌కే ఫోన్ చేసి బెదిరించి రూ.98 వేలు కాజేసిన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. శనివారం మధ్యాహ్నం 74832 47988 (మంజు గౌరి పేరుతో ఉన్నది) నంబర్ నుంచి తహసీల్దార్ ముత్తయ్యకు ఫోన్ వచ్చింది. ‘ఏసీబీ అధికారిని మాట్లాడుతున్నా.. మీ ఆర్‌ఐ నాకు చిక్కాడు. మీ పేరు చెబుతున్నాడు. కేసులో మీ పేరు కూడా రాస్తా.. కావాలంటే మాట్లాడండి’ అని ఆర్‌ఐతో ఫోన్‌లో మాట్లాడించాడు. రూ.2 లక్షలు ఇస్తే కేసు లేకుండా చేస్తానని చెప్పాడు. అయితే విషయం ఏంటో తెలుసుకోకుండానే భయాందోళనకు గురైన తహసీల్దార్ ఫోన్ చేసిన వ్యక్తికి మొదట రూ.50వేలు, ఆ తర్వాత అర్ధగంట వ్యవధిలో రూ.48 వేలు.. మొత్తం రూ.98 వేలు ఫోన్ పే చేశారు. ఆ తర్వాత ఆర్‌ఐని పిలిచి మాట్లాడితే.. తన వద్దకు ఎవరూ రాలేదని, ఫోన్‌లో మాత్రమే మాట్లాడానని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన తహసీల్దార్ వెంటనే సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు. అనంతరం ముత్తయ్య మాట్లాడుతూ.. ఈనెలాఖరున తాను రిటైర్డ్ అవుతున్నానని, ఏసీబీ అధికారినని చెప్పగానే కంగారులో ఫోన్ పే చేశానని చెప్పారు. తనకు ఏసీబీ అధికారినంటూ ఫోన్ రావడం అనుమానంగా ఉందని, ఎవరో కుట్ర పన్ని ఇలా చేశారని అంటున్నారు. ఆ తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వచ్చిందని చెప్పారు. దీనిపై ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు. కాగా, ఆర్‌ఐ రత్తయ్యను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

అశ్వాపురం: చర్ల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా లారీలో తరలిస్తున్న 35 పశువులను అశ్వాపురం ఎస్‌ఐ మధుప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం పట్టుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకొని పశువులను గోశాలకు తరలించారు. ఎస్‌ఐ మధుప్రసాద్ మాట్లాడుతూ.. ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశాల మేరకు మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో నిఘా పెట్టి పశువులను పట్టుకున్నామని, ఎవరైనా పశువుల అక్రమ రవాణా చేస్తే సమాచారం అందించాలని సూచించారు.

మణుగూరులో..

మణుగూరుటౌన్: అక్రమంగా కబేలాకు తరలిస్తున్న పశువులను శనివారం రాత్రి మణుగూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ ప్రసాద్ కథనం ప్రకారం.. చర్ల మండలం నుంచి గోదావరి మీదుగా మణుగూరుకు తరలించి అక్కడి నుంచి కబేలాకు రాత్రివేళ తరలిస్తున్న 13 ఎద్దులు, 2 ఆవులను ఏరియా స్టోర్ గ్రౌండ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న పశువులను పాల్వంచ గోశాలకు తరలించనున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పీవీకాలనీలో దొంగల హల్‌చల్

మణుగూరురూరల్: మండలంలోని సింగరేణి కార్మికులు నివాసముండే పీవీ కాలనీ ఎంసీ క్వార్టర్ల ప్రాంతంలో దొంగలు శుక్రవారం అర్ధరాత్రి హల్‌చల్ చేశారు. నాలుగు క్వార్టర్లలోకి చొరబడి విలువైన ఆభరణాలు, వస్తువులను చోరీచేశారు. ఎంసీ 175, 183, 190, 195 క్వార్టర్ల లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు చొరబడి బంగారు ఆభరణాలు, లాప్‌టాప్, గ్యాస్ సిలిండర్లు, టీవీలు చోరీ చేశారు. ఇన్‌చార్జ్ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ ప్రసాద్ చేరుకుని చోరీలు జరిగిన తీరును పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. కొంతకాలంగా కాలనీల్లో దొంగతనాల సంఖ్య పెరిగిపోవడంతో ప్రత్యేక డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



కొర్సా అరవింద్ మృతదేహం

ములకలపల్లి: ఇంట్లో వేలాడే విద్యుత్ తీగలు ఆ యువకుడి పాలిట యమపాశాలయ్యాయి. ఆరేసిన బట్టలు తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని వీకే రామవరంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొర్సా శ్రీను పద్మ దంపతుల చిన్న కుమారుడు అరవింద్ (14).. స్నానం చేసి, ఇంట్లో దండేనికి ఆరేసిన బట్టలు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అటవీ సిబ్బందిని అడ్డుకున్న పోడురైతులు

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెం గ్రామపంచాయతీ ఎల్లాపురం గ్రామంలో అటవీశాఖ సిబ్బందిని పోడురైతులు శనివారం అడ్డుకున్నారు. రైతులు తమ చేలల్లో విద్యుత్ సౌకర్యం కోసం పనులు చేయడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి బయలుదేరగా ఎల్లాపురం సమీపంలోనే పోడు రైతులు అడ్డుకున్నారు. పోడు భూములకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఉన్నతాధికారుల అనుమతితోనే తాము విద్యుత్ స్తంభాలు పాతేందుకు పనులు చేపట్టామని తెలిపారు. దీంతో అటవీశాఖ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బాలిక అదృశ్యంపై కేసు

భద్రాచలంఅర్బన్: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన చిలకల లక్ష్మి, ఆదినారాయణకు 15 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి బాబు, పాప సంతానం. కాగా ఈ నెల 22న అర్ధరాత్రి లక్ష్మి నిద్ర లేచిచూడగా ఇంట్లో కూతురు కనిపించలేదు. ఎక్కడా ఆచూకీ దొరక్కపోవడంతో శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లక్ష్మి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ ఘటనపై..

భద్రాచలంఅర్బన్: బంగారు ఆభరణాల చోరీపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. భద్రాచలం పట్టణంలోని గోల్డ్‌స్మిత్‌కాలనీకి చెందిన మహిళ అంజు పాల్ ఈ నెల 22న హనుమాన్ జయంతి సందర్భంగా తన స్నేహితులతో కలిసి రామాలయం దర్శనానికి వెళ్లింది. ఈ క్రమంలో ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి, రూ. 56 వేల విలువైన బంగారం చోరీ చేశారని.. అంజుపాల్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేయగా టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.